

సాక్షి ఖమ్మం

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



'ఆరోగ్య' గౌతంపూర్

భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం గౌతంపూర్ జీపీ ఆరోగ్య పంచాయతీ విభాగంలో జాతీయ స్థాయిలోనే మొదటి స్థానం సాధించింది. 10లో



రామాలయంలో ప్రక్షాళన

భద్రాద్రి రామాలయం ఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమాదేవి పలు విభాగాల్లో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 23°

వాతావరణం

శనివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.


ప్రార్థన చేస్తున్న యువతి


బల్లేపల్లిలో శిలువ మార్గం ర్యాలీలో క్రైస్తవులు




ఖమ్మం ఆర్‌సీఎం చర్చిలో సిలువ వేయబడిన ఏసుక్రీస్తు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


సిలువ మార్గంలో ర్యాలీలో రోదిస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే, యేసు సిలువపై ప్రాణాలను అర్పించిన తీరును మతపెద్దలు వివరించారు. జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల యేసు శిలువ మార్గం ప్రదర్శన నిర్వహించగా క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాపుల కోసం ఏసు పడిన కష్టాలను జ్ఞాపకం చేసుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



రంజాన్ వేళలు

ఇఫ్తార్
(శనివారం సా॥)
6.28

సహర్
(ఆదివారం ఉ॥)
4.36

న్యూస్‌రీల్

వైరా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు


పఠాని వెంకటేశ్వర్లు

వైరా: వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఐదేళ్లు గడుస్తుండగా తొలిసారి పూర్తిస్థాయి కమిషనర్‌గా పఠాని వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఇన్‌చార్జ్ కమిషనర్ అనిత నుంచి బాధ్యతలు స్వీకరించారు. వనపర్తి జిల్లా కొత్తకోట గ్రేడ్–3 కమిషనర్‌గా రెండేళ్లపాటు పనిచేసిన వెంకటేశ్వర్లు, అంతకుముందు మిర్యాలగూడ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారం, కౌన్సిల్ సభ్యుల ప్రోత్సాహంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

రెండో జోన్‌కు నీటి సరఫరా కొనసాగించండి

ఖమ్మంమయూరిసెంటర్: నాగార్జునసాగర్ రెండో జోన్ పరిధిలోని ఆయకట్టుకు ఈనెల 30వ తేదీ వరకు సాగునీటి సరఫరా కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు కోరారు. రెండో జోన్ పరిధిలో మొక్కజొన్న, వరి ఇతర పంటలకు సాగునీటి అవసరమున్నందున ప్రభుత్వం స్పందించాలని ఆయన ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వానాకాలంలో సరైన దిగుబడి రాక నష్టపోయిన రైతులు యాసంగిలో ఆలస్యంగాపంటలు సాగు చేశారని, వాస్తవ పరిస్థితులను గమనించి ఈనెలాఖరు వరకు సాగునీటి విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. అలాగే, ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని కోరారు.

సింగరేణి రక్షణకు మహోద్యమం

- ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మంమయూరిసెంటర్: సింగరేణి ప్రైవేటీకరణపై కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తగ్గకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మరో మహోద్యమం చేపట్టాల్సి వస్తుందని బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు హెచ్చరించారు. సింగరేణిలోని సత్తుపల్లి బ్లాక్–3, పెనగడప, శ్రావనపల్లి గనులను వేలం వేసేందుకు ఇచ్చిన నోటిఫికేషన్ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఏడాది నవంబర్‌లో రామగుండం పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ సింగరేణిని ప్రైవేటీకరించబోమని చేసిన ప్రకటనను విస్మరించారని పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలంపై తాను పలుమార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించానని, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ కూడా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారని ఎంపీ పేర్కొన్నారు. అయినప్పటికీ మొండిగా ముందుకెళ్తున్న కేంద్రం కుట్రలను ఎండగడతామని నామా నాగేశ్వరరావు తెలిపారు. కాగా, సింగరేణి ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం కొత్తగూడెంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎంపీ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

సీఎం ఆర్‌ఎఫ్ గోల్‌మాల్

నకిలీ మెడికల్ బిల్లులతో నిధులు స్వాహా

- సైఫాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన సచివాలయ అధికారులు
- ఖమ్మం శ్రీ వినాయక ఆస్పత్రిపై కేసు నమోదు
- మరికొన్ని ఆస్పత్రుల్లో బిల్లులపై నిఘా



నగరంలోని శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఆస్పత్రిలో చికిత్స చేయించుకోకున్నా, నకిలీ బిల్లులు అందజేసి ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) నిధులు కాజేసిన వైనంపై ఖమ్మంలోని ఓ ఆస్పత్రిపై కేసు నమోదైంది. ఖమ్మం నెహ్రూనగర్‌లోని శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రమావత్ శివ చికిత్స పొందినట్లుగా నకిలీ బిల్లులు సృష్టించినట్లు సమాచారం. దీంతో సదరు వ్యక్తితోపాటు ఆస్పత్రి నిర్వాహకులపై హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. ఇలాగే బిల్లులు స్వాహా చేసిన మరో ముగ్గురితో పాటు నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన ఆస్పత్రిపై కూడా కేసు రిజిస్టర్ చేశారు. అయితే ఈ వ్యవహారంలో నల్లగొండ, ఖమ్మంలోని మరికొన్ని ఆస్పత్రులు కూడా ఉన్నాయనే సమాచారంతో పోలీస్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

నకిలీ పత్రాలు సృష్టించి..

అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటే స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసుతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు విడుదల చేస్తారు. ఈక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేయాలనే ప్రణాళికతో కొందరు ఖమ్మంలోని నెహ్రూనగర్‌లో ఉన్న శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిబ్బందితో కుమ్మక్కైనట్లు సమాచారం. నల్లగొండ జిల్లా చలకుర్తి సమీపంలోని పూల్యతండాకు చెందిన రమావత్ శివ ఈ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1,55,854 బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు నిధులు మంజూరు కావడంతో కాజేశారు. కాగా, సచివాలయంలోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీఎస్‌ఎన్.మూర్తి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల మంజూరు అంశాలను పరిశీలించే క్రమంలో శ్రీవినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు మిర్యాలగూడెంకు సంబంధించి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నుంచి వచ్చిన మూడు దరఖాస్తులకు జత చేసిన బిల్లులపై అనుమానం వచ్చింది. దీంతో ఆయన గత నెల మార్చి 21న ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినందుకు ఆస్పత్రులు, నిందితులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సెక్షన్ 420, 468, 471,120బీ, ఆర్‌డబ్ల్యూ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేయడంతో పాటు కేసు తీవ్రత దృష్ట్యా దర్యాప్తు కోసం హైదరాబాద్ సీసీఎస్‌కు అప్పగించారు.

నల్లగొండ ముఠాతో చేతులు కలిపి..

నకిలీ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసిన వ్యవహారంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన ఆస్పత్రిపై కేసు నమోదైంది. అయితే సదరు ఆస్పత్రితో పాటు మరికొన్ని ఆస్పత్రుల నిర్వాహకులతో ఖమ్మంలోని పలు ఆస్పత్రుల బాధ్యులు కుమ్మక్కై, నకిలీ బిల్లులు సృష్టించారనే సమాచారంతో పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. తొలుత నల్లగొండ జిల్లాలో ఈ దందా మొదలు కాగా.. అక్కడి ముఠాతో ఖమ్మంలోని కొన్ని ఆస్పత్రుల బాధ్యులు చేతులు కలిపి నకిలీ బిల్లుల దందాకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నయా దందా

అనేక రకాలుగా ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు ఇప్పుడు నయా దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. నకిలీ సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ దందాలో నల్లగొండకు చెందిన ఓ ముఠాతో కుమ్మక్కైన ఖమ్మంలోని పలు ఆస్పత్రుల నిర్వాహకులు ఈ దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.ఇప్పటికే నకిలీ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసిన విషయమై శ్రీవినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌పై కేసు నమోదు చేయగా, నగరంలోని మరో ఆరు ఆస్పత్రులపై కూడా పోలీస్ నిఘా వర్గాలు దృష్టి సారించినట్లు సమాచారం. కాగా, హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు శుక్రవారం వినాయక ఆస్పత్రికి వచ్చి ఆరా తీశారు.

మాకేం సంబంధం లేదు..

నకిలీ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసిన అంశంతో మాకెలాంటి సంబంధం లేదు. దీనిపై మాకు ఎలాంటి సమాచారం కూడా అందలేదు. ఈ విషయంలో మమ్ముల్ని ఎవరూ అడగలేదు. సీఎంఆర్‌ఎఫ్ ఆఫీస్ నుంచీ ఎవరూ మాట్లాడలేదు. మా ఆస్పత్రిలో ఎలాంటి అవకతవకలకు జరగలేదు.

– లక్ష్మణరావు, నిర్వాహకులు, శ్రీవినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, ఖమ్మం

మళ్లీ కోవిడ్ కలకలం

- కరోనాతో చికిత్స పొందుతూ ఒకరు మృతి
- వారం రోజులుగా వెలుగులోకి కేసులు
- అప్రమత్తమవుతున్న వైద్య, ఆరోగ్య శాఖ


ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ వార్డు

ఈ వారం నమోదైన కేసులు

తేదీ	కేసులు
1	2
2	0
3	0
4	10
5	9
6	8



ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో మళ్లీ కరోనా కలకలం రేపుతోంది. ఈ నెలలో ఒక్కొక్కటిగా పాజిటివ్ కేసులు వెలుగు చూస్తుండడంతో ఇంత కాలం ప్రశాంతంగా ఉన్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా పాజిటివ్ కేసులు నమోదవుతుండడం అటు ప్రజలను, ఇటు అధికారులను అయోమయానికి గురిచేస్తోంది. కరోనా బారిన పడిన జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందడంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో కరోనా తొలి కేసు 2020 ఏప్రిల్‌లో నమోదు కాగా, ఇప్పటి వరకు లక్షకు పైగా పాజిటివ్ కేసులు నమోదవడంతో ప్రజలు అల్లాడిపోయారు. మళ్లీ కేసులు వస్తుండడంతో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

వారంలో 29 కేసులు

వారం రోజులుగా కోవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. గత ఏడాది డిసెంబర్ తర్వాత ఈనెల 1వ తేదీనే మొదటి కేసు నమోదైంది. అప్పటి నుండి 7వ తేదీ వరకు 29 మందికి కరోనా సోకడం భయాందోళన కలిగిస్తోంది. కోవిడ్ వ్యాప్తితో ప్రభావం ఏ మేరకు ఉంటుందోనన్నది ఎవరికీ అంతుపట్టడం లేదు. కాగా, బూర్గంపాడు సమీపాన ఏపీలోని కుక్కునూరుకు చెందిన 62 ఏళ్ల వ్యక్తికి కరోనా సోకగా రెండు రోజుల క్రితం ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు చికిత్స అందిస్తుండగా శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అంతే కాకుండా కోవిడ్ వార్డులో మరో ముగ్గురు చికిత్స పొందుతుండడం గమనార్హం. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరిన వారి సంఖ్య తెలియాల్సి ఉంది. కోవిడ్ చాప కింద నీరులా వ్యాప్తి చెందుతుందన్న ప్రచారంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై కోవిడ్ పరీక్షలు పెంచడమే కాక మందులు, బెడ్లు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఈనెల 10, 11వ తేదీల్లో మాక్ డ్రిల్ చేపట్టేందుకు ఏర్పాట్లలో నిమగ్నయయ్యారు.

గత మూడు వేవ్‌ల్లో నమోదైన పాజిటివ్ కేసులు, మరణాలు

వేవ్	కేసులు	మరణాలు
మొదటి	23,789	210
రెండు	68,030	1,185
మూడు	18,359	52

17నుంచి కేయూ బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) షెడ్యూల్ విడుదల చేశారు. ఈ పరీక్షలు 17వ తేదీ నుంచి మొదలవుతాయని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 17, 19, 21, 24, 26, 28 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

ప్రారంభమే ఆలస్యం..

- ఇల్లెందులో నిర్మాణం పూర్తయిన ఆర్టీసీ డిపో
- ఫిబ్రవరిలోనే హడావుడి.. ఆతర్వాత కదలిక లేని వైనం
- వేసవి సీజన్ మొదలుకావడంతో పెరిగిన ప్రయాణాలు


ఇల్లెందులో నిర్మించిన ఆర్టీసీ బస్ డిపో

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దశాబ్దాల తరబడి విజ్ఞప్తులు, విన్నపాలకే పరిమితమైన బస్‌డిపో కల సాకారమై కళ్ల ముందు కనిపిస్తున్నా అందుబాటులోకి రాకపోవడంతో ఇల్లెందు ఏజెన్సీ ప్రజలకు ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. గడిచిన మూడు దశాబ్దాలుగా ఇల్లెందులో బస్ డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్లు వచ్చినా నెరవేరలేదు. చివరకు రవాణా శాఖ మంత్రి పదవి ఉమ్మడి జిల్లాకు చెందిన పువ్వాడ అజయ్‌కుమార్‌కు దక్కడం.. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ పట్టువీడకుండా ప్రయత్నించగా ఇల్లెందుకు శాటిలైట్ డిపో మంజూరైంది. అయితే, ఆర్టీసీ కష్టాల్లో ఉండటంతో డిపో నిర్మాణానికి సుమారు రూ.3.90కోట్లను జిల్లా మినరల్ ఫండ్ నుంచి మంజూరు చేయగా, 2021 ఫిబ్రవరిలో పనులు మొదలయ్యాయి.

రెండేళ్లపాటు నిర్మాణం

డిపో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో 2021 దసరా నాటికి పూర్తి కావాల్సిన పనులు 2022 దసరా వచ్చినా కొలిక్కిరాలేదు. ఈ నేపథ్యాన ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ అనుదీప్ ప్రత్యేక దృష్టి సారించి కాంట్రాక్టర్‌ను హెచ్చరించడంతో దీంతో గతేడాది చివర్లో పనుల్లో వేగం పెంచి ఈ ఏడాది జనవరి నాటికి ఫ్యూయల్ స్టేషన్ (పెట్రోల్ బంక్) మినహా మిగతా పనులన్నీ పూర్తి చేశారు. అలాగే, 27కొత్త బస్సులు డిపోకు కేటాయించేందుకు రంగం సిద్ధం చేశారు.

కేటీఆర్ ప్రారంభించాలని..

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ ఉమ్మడి జిల్లాకు వస్తుండడంతో అదే నెల 10వ తేదీన ఇల్లెందు డిపోను కూడా ప్రారంభిస్తారని ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను చకచకా పూర్తి చేస్తుండగానే కేటీఆర్ పర్యటన రద్దయింది. దీంతో పాటే డిపో ప్రారంభోత్సవం కూడా వాయిదా పడగా.. రెండు నెలలు గడుస్తున్నా అటు ఎమ్మెల్యే హరిప్రియ, ఇటు ఆర్టీసీ అధికారులు ఎలాంటి ప్రకటన చేయడం లేదు.

సీజన్ మొదలైనా..

వేసవి సమీపించడంతో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు వస్తున్నాయి. దీంతో దూర ప్రయాణాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో డిపో మొదలైతే ఇల్లెందు నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వరంగల్, జమ్మికుంట, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లి, వేములవాడ వంటి దూర ప్రాంతాలకు సర్వీసులు అందుబాటులోకి వచ్చేవి. అలాగే, రాత్రి వేళ గుండాల, గంగారం, బోడుకు బస్సులు కూడా మొదలయ్యేవి. కానీ డిపో సిద్ధంగా ఉన్నా ప్రారంభోత్సవంపై తాత్సారం చేస్తుండటంతో ఈ వేసవి సీజన్‌లోనూ ఇల్లెందు వాసులకు తిప్పలు తప్పేలా లేవు. కాగా, ఇల్లెందు శాటిలైట్ డిపోలో ఫ్యూయల్ స్టేషన్ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రాకపోవడం గమనార్హం.

ఇక చకచకా హైవే

- ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు నేడు లాంఛనంగా శంకుస్థాపన
- హైదరాబాద్ పర్యటనలో శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- జిల్లాలో 98కి.మీ. మేర రహదారి నిర్మాణానికి ఏర్పాట్లు
- ఇప్పటికే భూసేకరణ పూర్తి.. పనుల మొదలు




ఖమ్మం - దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే మ్యాప్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్: రాష్ట్రంలోని పలు రహదారులను జాతీయ రహదారులుగా మార్చి అభివృద్ధి చేస్తుండగా, కొత్తగా కూడా కొన్ని జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా మీదుగా ఇప్పటికే పలు జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయింది. తాజాగా ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే (365బీజీ) నిర్మాణానికి ప్రధానమంత్రి మోదీ శనివారం హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. అయితే, ఈ రహదారి కోసం ఇప్పటికే జిల్లాలో భూసేకరణ పూర్తికాగా, పనులు కూడా మొదలయ్యాయి. ప్రధాని పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేయనుండడంతో పనులు చురుగ్గా సాగుతాయని భావిస్తున్నారు.

భూసేకరణ పూర్తి

జిల్లాలోని పది మండలాలు, 31 గ్రామాల మీదుగా ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం జరగనుంది. జిల్లాలో 98 కి.మీ. మేర రహదారి నిర్మి స్తుండగా సుమారు 900మంది రైతుల నుంచి 1,300 ఎకరాల మేర భూమి సేకరించారు. ఇందుకోసం రైతులకు రూ.419కోట్లకుగాను రూ.411కోట్ల పరిహారం కూడా చెల్లించేశారు.

మూడు ప్యాకేజీల్లో..

ఖమ్మం–దేవరపల్లి నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టును మూడు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. ప్యాకేజ్–1 కింద 33.604కి.మీ., ప్యాకేజ్–2 కింద 29.513కి.మీ., ప్యాకేజ్–3 కింద 42.119కి.మీ.గా పనులు మొదలుపెట్టారు. మొత్తం రహదారి నిర్మాణానికి రూ.948.53కోట్లు కేటా యించారు. ప్యాకేజ్–1 పనులు గత ఏడాది అక్టోబర్ 31న ప్రారంభం 2024 అక్టోబర్ 29నాటికి పూర్తిచేయాలని నిర్దేశించారు. అలాగే, ప్యాకేజ్–2 పనులు గత ఏడాది సెప్టెంబర్ 13న మొదలుకాగా, 2024 అక్టోబర్ 11 నాటికి, ప్యాకేజ్–3 పనులు గత ఏడాది సెప్టెంబర్ 27న మొదలుపెట్టగా 2024 సెప్టెంబర్ 25 నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం. కాగా, ఈ రహదారి నిర్మాణంలో భాగంగా ఏడు సర్వీస్ రోడ్లు, మేజర్ బ్రిడ్జిలు, 30 మైనర్ బ్రిడ్జిలు, నాలుగు ఆర్‌యూబీ/ఆర్‌ఓబీలు నిర్మించాల్సి ఉంది. ఇక ఐదు చోట్ల జాతీయ రహదారికి ఇంటర్ చేంజ్(అనుసంధానం) ఇవ్వనున్నారు.

లక్ష్యం దిశగా పనులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ఇప్పటికే మొదలు కాగా.. ప్రధాని మోదీ శనివారం లాంఛనంగా శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పనుల్లో మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. రెండేళ్లలో జాతీయ రహదారిని పూర్తిచేయాలనేది లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటికే భూసేకరణ కూడా పూర్తయిన నేపథ్యాన పనుల్లో వేగం పెరుగుతుందని చెబుతున్నారు.

నేషనల్ హైవే స్వరూపం ఇలా..

రహదారి వెళ్తున్న మండలాలు	10
గ్రామాలు	31
రహదారి నిడివి	98
నిర్మాణ వ్యయం	రూ.948.53 కోట్లు
సేకరించిన భూమి	1,300 ఎకరాలు
భూ పరిహారం	రూ.419కోట్లు
రైతులకు చెల్లించిన పరిహారం	రూ.11కోట్లు
ఇంకా చెల్లించాల్సిన నగదు	రూ.8కోట్లు

క్లుప్తంగా

నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆయన బోనకల్, మధిర, ఎర్రుపాలెం, పెనుబల్లి, కల్లూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రముఖ వైద్యుడు వీరేశ్వర్ మృతి


డాక్టర్ బండ్ల వీరేశ్వర్ (ఫైల్)

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని సీస్టార్ సంకల్ప, మాతృశ్రీ హస్పిటళ్ల చైర్మన్, ప్రముఖ వైద్యులు బండ్ల వీరేశ్వర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. గత ఆదివారం ఆయన అనారోగ్యానికి గురికాగా సీస్టార్ ఆస్పత్రికి, ఆతర్వాత హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న తరుణంలోనే ఆరోగ్యం మరింతగా క్షీణించి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు వీరేశ్వర్ అవయవాలు దానం చేశారు. అనంతరం శుక్రవారం మృతదేహన్ని ఖమ్మం తీసుకొచ్చి ఐఎంఏ హాల్, సీస్టార్ ఆస్పత్రుల వద్ద కాసేపు ఉంచగా పలువురు వైద్యులు, నాయకులు నివాళులర్పించారు. ఆతర్వాత మృతదేహన్ని వీరేశ్వర్ స్వగ్రామమైన మిర్యాలగూడ మండలం గోగువారి గూడెం తరలించారు.

ఎన్ఆర్ఐ సుగుణమ్మ మృతి


సుగుణమ్మ (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పెందుర్తి సుగుణమ్మ(92) శుక్రవారం మృతి చెందారు. పెందుర్తి మధుసూదన్‌రావు మెమోరియల్ ట్రస్టు చైర్మన్ రవి తల్లి అయిన ఆమె మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. కాగా, సుగుణమ్మ శుక్రవారం అమెరికాలో మృతి చెందగా, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీటీసీ మరికంటి ఉమారాణి, సర్పంచ్ గురవమ్మ, పీఎంఆర్ ట్రస్టు వైస్ చైర్మన్ ఎస్.వీ.ఆర్.పురుషోత్తంరావుతో పాటు విజయ్‌కుమార్, సుంతరమోని నాగార్జున తదితరులు సంతాపం ప్రకటించారు.

రోడ్డుప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

- విధుల్లో ఉండగా ఢీకొట్టిన కారు


కాకాటి ధనమ్మ (ఫైల్)

కల్లూరు: కల్లూరులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ పంచాయతీ కార్మికురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు జీపీలో ఆరేళ్ల నుంచి పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కాకాటి ధనమ్మ(55) రోజులాగే శుక్రవారం ఉదయం విధులకు వచ్చింది. ఈమేరకు రహదారులు శుభ్రం చేస్తుండగా సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఆమెను వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ధనమ్మకు కల్లూరులో ప్రథమ చికిత్స చేయించాక ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఆమెకు భర్త అప్పులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, ధనమ్మ మృతదేహం వద్ద ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సర్పంచ్ లక్కినేని నీరజ, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘుతో పాటు ఊడల కృష్ణ, సుధాకర్, వజీర్‌మియా, చింతపల్లి శ్రీను, నరసింహారావు నివాళులర్పించారు.

మూగజీవాలను బలిగొన్న లారీ

సత్తుపల్లిరూరల్: ఓ లారీ అతివేగంగా వెళ్తూ గేదెలను మేతకు తీసుకెళ్తున్న వెళ్తున్న వ్యక్తితో పాటు గేదెలను ఢీకొట్టింది. ఈఘటనలో రెండు గేదెలు మృతి చెందగా, ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. సత్తుపల్లి మండలం గంగారానికి చెందిన పాట్లపోగు శ్రీనివాసరావు తన ఐదు గేదెలను శుక్రవారం మేతకు తీసుకెళ్తుండగా వెళ్తుండగా సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు సత్తుపల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


మధిర: మండలంలోని ఆత్కూరు సమీపాన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడుకు గ్రామానికి చెందిన నల్లగట్ల నాగమల్లేశ్వరరావు మధిర నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మోటార్ సైకిల్ పైనుంచి కింద పడడంతో గాయలయ్యాయి. అయితే, ఆయన ప్రమాదవశాత్తు కింద పడ్డాడా, ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనేది తెలియరాలేదు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

'ఆరోగ్య' గౌతంపూర్


గౌతంపూర్ గ్రామం వ్యూ

- జాతీయస్థాయిలో ప్రథమస్థానం సాధించిన పంచాయతీ
- పాలకవర్గం, అధికారులు, సిబ్బందికి భద్రాద్రి కలెక్టర్ అనుదీప్ ప్రశంసలు

చుంచుపల్లి: జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా నిలిచిన భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం గౌతంపూర్ ఇప్పుడు జాతీయ స్థాయిలో మెరిసింది. గ్రామపంచాయతీలకు కేంద్రం శుక్రవారం అవార్డులు ప్రకటించగా, 'ఆరోగ్య పంచాయతీ(హెల్దీ పంచాయతీ) విభాగంలో గౌతంపూర్ జాతీయస్థాయిలోనే మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి ఉత్తమ గ్రామపంచాయతీలకు ఈనెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందించనున్నారు. గౌతంపూర్‌కు అవార్డుతోపాటు రూ.50లక్షల నగదు పురస్కారాన్నీ అందిస్తారు.

గతేదాది అక్టోబర్‌లో దరఖాస్తు..

జాతీయస్థాయి అవార్డుల్లో భాగంగా గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పురస్కారాలకు తొమ్మిది విభాగాల్లో పనితీరును పరిశీలించారు. గౌతంపూర్ గ్రామపంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామంలో అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు వంటివి నిర్వహించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిచింది. ఆ తర్వాత జాతీయస్థాయి అవార్డుకు నామినేట్ చేయగా దేశంలో ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా మొదటి స్థానం దక్కించుకుంది. ఉత్తమ పంచాయతీగా జాతీయస్థాయిలో నిలిపిన గౌతంపూర్ సర్పంచ్ పాడియం సుజాత, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి జక్కం షర్మిల, మండల అధికారుల బృందం జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్ రాజులను కలెక్టర్ అనుదీప్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా నుంచి జాతీయస్థాయిలో గౌతంపూర్ అవార్డును దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది అందరి కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో పల్లెలను మరింత ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేయాలని సూచించారు.

ఇతర పంచాయతీలకు ఆదర్శం



జాతీయస్థాయిలో గౌతంపూర్ గ్రామపంచాయతీ అవార్డు దక్కించుకోవడం ఆనందంగా ఉంది. పంచాయతీ పాలకవర్గం అభివృద్ధిపై మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించటం వల్లనే ఇది సాధ్యమైంది. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉంటే అవార్డులు వాటంతట అవే వరిస్తాయి.

–గుండి సత్యనారాయణ, ఎంపీఓ

సమష్టి కృషితోనే అవార్డు..



గౌతంపూర్‌కు జాతీయస్థాయిలో అవార్డు రావడం వెనక పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, మండల అధికారుల సమష్టి కృషి ఉన్నది. గ్రామ పంచాయతీ అభివృద్ధి పరచాలనే పట్టుదలతో పాలకవర్గం ముందుకెళ్లడం ప్రశంసనీయం. అవార్డుల పరంపరలో పంచాయతీ దూసుకెళ్తోంది. –రమాకాంత్, డీపీఓ

ఇవి ప్రత్యేకతలు..

- గౌతంపూర్.. ఉమ్మడి రుద్రంపూర్ పంచాయతీ నుంచి 4,407 జనాభాతో 2019లో కొత్త పంచాయతీగా ఏర్పడగా, ప్రస్తుతం తొలిపాలక మండలి పాలన సాగిస్తోంది. పంచాయతీలో 12 వార్డులు ఉండగా, మహిళా సర్పంచ్ పాలన సాగిస్తున్నారు.
- పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్, హరిత నర్సరీ ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎస్సార్ నిధులు కూడా అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పడుతున్నాయి.
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పాలకవర్గం, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పచ్చదనం, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ లు, రహదారుల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు.
- కరోనా మహమ్మారి నియంత్రణకు విశేషంగా కృషి సల్పి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. కరోనా నివారణ వ్యాక్సినేషన్ 100 శాతం పూర్తి చేశారు. విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వారంలో రెండు రోజులు డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం పాటిస్తున్నారు.


గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది


వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సింగరేణి పరిరక్షణకు ఉద్యమం


మాట్లాడుతున్న విప్ కాంతారావు, పక్కన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యేలు వెంకటేశ్వరరావు, సండ్ర తదితరులు

- నేడు కొత్తగూడెంలో మహాధర్నా
- బీఆర్ఎస్ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు కాంతారావు, మధు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్రాన్ని అస్థిరపర్చే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే యత్నం చేస్తోందని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, విప్ రేగా కాంతారావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. కోట్లాది మంది ప్రాణాధారమైన సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు రాజకీయాలు, యూనియన్లకు అతీతంగా ఉద్యమించాలని కోరారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపులో భాగంగా కొత్తగూడెంలో శనివారం మహాధర్నా నిర్వహించనున్న నేపథ్యాన కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావ్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పి.. ఢిల్లీ వెళ్లగానే కోయగూడెం, శ్రావణపల్లి, సత్తుపల్లి ఓసీ తదితర గనులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేలా టెండర్లు ఆహ్వానించారని మండిపడ్డారు. సింగరేణిని ప్రైవేటీకరించడమంటే తెలంగాణ గొంతు కోయడమేనని వ్యాఖ్యానించిన వారు.. బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో దేశాన్ని భ్రష్టుపట్టిస్తూ జాతి విద్రోహానికి పాల్పడుతోందని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను అడ్డుకోవడంతో పాటు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈమేరకు కేంద్రం తీరును నిరసిస్తూ కొత్తగూడెంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యాన చేపడుతున్న మహాధర్నాలో అన్ని వర్గాల ప్రజలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కాంతారావు, మధు కోరారు. కాగా, ప్రశ్నపత్రాల లీకేజీతో విద్యార్థుల జీవితాలను ఇరకాటంలోకి నెట్టిన బీజేపీ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుతో పాటు నాయకులు మోరె భాస్కర్, జేవీఎస్.చౌదరి, బాదావత్ శాంతి, ఎం.డీ.రజాక్, ఎం.సోమిరెడ్డి, కాపు కృష్ణ, కూసన వీరభద్రం, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తొలుత కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో ఎమ్మెల్యేలు


కల్లూరులో శిలువ మోస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య


వైరాలో శిలువ మార్గ ప్రదర్శనలో ఎమ్మెల్యే రాములునాయక్

వైరా/కల్లూరు: గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లాలో క్రైస్తవులు శిలువ మార్గంతో ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే, చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్లూరు, వైరాల్లో జరిగిన శిలువ మార్గం ప్రదర్శనల్లో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్ పాల్గొని కొద్దిసేపు భక్తులతో కలిసి శిలువ మోశారు.

పేదలకు అండగా ఎర్రజెండా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం


మంగళగూడెంలో పర్యటిస్తున్న వీరభద్రం, నాయకులు

ఖమ్మంరూరల్: పేదలకు ఎర్ర జెండా ఎల్లప్పుడు అండగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. మండంలోని మద్దివారిగూడెం, మంగళగూడెం, పోలేపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం తమ్మినేని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. మోదీ అధికారం చేపట్టిన తొమ్మిదేళ్లలో దళితులు, గిరిజనులు, అట్టడుగు వర్గాలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని ఆరోపించారు. మనువాద సిద్ధాంతాన్ని మరోసారి ప్రవేశ పెట్టేందుకు బీజేపీ విశ్వప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. ఈక్రమంలో బీజేపీని ఓడించేందుకు దేశవ్యాప్తంగా లౌకిక శక్తులతో చేతులు కలుపుతామని.. రానున్న ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ కలిసి పోటీ చేస్తాయని తమ్మినేని తెలిపారు. కాగా, తెలంగాణలో ప్రశ్నపత్రాల లీకేజీల ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నంద్ర ప్రసాద్, కె.రామయ్య, కర్ణకుమార్, టి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్‌కు నివాళి

ఖమ్మంమయూరిసెంటర్: కేన్సర్ బారిన పడి ఆస్ట్రేలియాలో మృతి చెందిన డాక్టర్ హర్షవర్ధన్ కుటుంబాన్ని ఖమ్మం శ్రీనివాసనగర్‌లో తమ్మినేని వీరభద్రం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హైదరాబాద్ నిరసనలో జిల్లా నేతలు


ఆందోళనలో పాల్గొన్న సౌజన్య, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన తెలి పారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయగా, కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు పద్మ, ఇందిర, లలిత, కవిత, సుల్తానా, జయమ్మ, సౌజన్య పాల్గొన్నారు.

దేవాలయాలకు పొంగులేటి విరాళం


ఆలయాల నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఇల్లెందు నియోజకవర్గంలోని పలు దేవాలయాల నిర్మాణానికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విరాళాలు అందజేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సమక్షాన ఆలయకమిటీ బాధ్యులకు విరాళం అందజేసి మాట్లాడారు. టేకులపల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, తొమ్మిదో మైలు తండాలోని ఆంజనేయస్వామి, కుంటల్ల ముత్యాలమ్మ, ఆంజనేయస్వామి, కోయగూడెంలో అయ్యప్ప స్వామి ఆలయం, చుక్కాల బోడు ఆంజనేయ స్వామి ఆలయాలకు రూ.25వేల చొప్పున రూ.1.50లక్షలతో పాటు గార్లలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.25వేలను పొంగులేటి అందజేశారు.

మృత్యుభీతి లేని బిడ్డ హర్షవర్ధన్

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం:మరణం సమీపించిందని తెలిసినా తల్లిదండ్రులు కలత చెందకుండా, భార్యకు అన్యాయం జరగకుండా అందరికీ ఆత్మీయత పంచి కన్నుమూసిన డాక్టర్ హర్షవర్ధన్ చిరస్మరణీయుడని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆస్ట్రేలియాలో ఇటీవల మృతి చెందిన హర్షవర్ధన్ తల్లిదండ్రులను ఖమ్మం శ్రీనివాసనగర్‌లో శుక్రవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. ఆతర్వాత నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు రఘునాథపాలెం మండలం పుఠాని తండా, సూర్యా తండాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కూడా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఇంకా పలు కార్యక్రమాలకు కూడా శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, విజయబాయి, ధరావత్ రామ్మూర్తి, షేక్ ఆరిఫ్, గుర్రం సత్యనారాయణ, మాలోత్ రాము, అరవికట్ల సుదీప్, మూడ్ చిన్నా, పూనెం ఉమ, పూనెం సురేందర్, బానోతు భద్రు, ఈది గణేష్, మోకాళ్ల పోశాలు, తులసీరాం, భూక్యా సర్దార్, బానోతు రవి, రావూరి సతీష్, వీరన్న పాల్గొన్నారు.

పది ఎకరాల జామాయిల్ తోట దగ్ధం

మధిర: మండలంలోని మల్లవరంలో శుక్రవారం ప్రమాదవశాత్తు సుమారు పది ఎకరాల్లో సాగుచేసిన జామాయిల్ తోట దగ్ధమైంది. ఈ ఘటనలో మధిర డివిజన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, కొంగర విశ్వేశ్వరరావు, కొంగర నాగేశ్వరరావుకు చెందిన జామాయిల్ తోట పూర్తిగా కాలిపోయింది. తోటలో చెత్తకు నిప్పంటుకుని ఒక్కసారిగా చెలరేగిన మంటలను గ్రామస్తులు ఆర్పుతూనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు చేరుకుని అదుపు చేశారు. లేనిపక్షంలో చుట్టుపక్కల మరో ఇరవై ఎకరాల్లో జామాయిల్, సుబాబుల్ తోటలు కూడా దగ్ధమయ్యేవని స్థానికులు తెలిపారు.

మిర్చి దగ్ధంపై ఫిర్యాదు

తిరుమలాయపాలెం: మండలంలోని తాళ్లచెరువులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా సుమారు ఆరు క్వింటాళ్ల మిర్చి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు పులకాని వెంకన్న రెండెకరాల్లో సాగు చేసిన మిర్చి ఏరి కల్లెంలో ఆరబోశాడు. అయితే, గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టగా పూర్తికాలిపోయింది. దీంతో రూ.1.2లక్షల మేర నష్టపోయినట్లుగా రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యాష్ ట్యాంకర్ పైనుంచి పడి డ్రైవర్ దుర్మరణం

కేటీపీఎస్ సైలో వద్ద ట్యాంకర్ మూత బిగిస్తుండగా ప్రమాదం


కేటీపీఎస్ సైలో వద్ద ట్యాంకర్ పైనుంచి పడిన డ్రైవర్ రమేశ్

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో యాష్ ట్యాంకర్ పైనుంచి పడి డ్రైవర్ తీవ్రగాయాల పాలయ్యాడు. హుటాహుటిన అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జెక్కపల్లి గ్రామానికి చెందిన చట్టు రమేశ్(40) ఓ సిమెంట్ కంపెనీలో 14 టైర్ల గూడ్స్ ట్యాంకర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలోని సైలో వద్ద ట్యాంకర్‌లో బూడిద లోడింగ్ కోసం వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో కేపీస్పీరోడ్‌లోని గేటు నుంచి లోపలికి వెళ్లి యాష్ లోడ్ చేసుకున్నాడు. అనంతరం ట్యాంకర్ పైకి ఎక్కి పైన ఉన్న పెద్ద మూతను ఇనుప రాడ్డు సాయంతో బిగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. కింద కాంక్రీట్ బెడ్ ఉండటంతో కింద పడగానే తలకు, కాలుకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే లోడింగ్ కోసం వచ్చిన కొందరు డ్రైవర్లు హుటాహుటిన అక్కడికి చేరుకుని అధికారులకు సమాచారం అందించారు. కేటీపీఎస్ అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రమేశ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ నరేశ్ సందర్శించి వివరాలు తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య శ్రీలత కుమారులు నితిన్, శ్రీకాంత్ ఉన్నారు. శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో రమేశ్ మృతదేహం చూసిన కుటుంబ సభ్యులు బోరు న విలపించారు. మృతుడి చిన్న కుమారుడు శ్రీకాంత్ వీఎం బంజరలో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. గుడ్ ఫ్రైడే సెలవు కావడంతో శనివా రం జరిగే గణితం పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాడు.

బూడిదను శుభ్రం చేయకపోవడంతోనే ప్రమాదం ?

కేటీపీఎస్ 7వ దశ సైలో వద్ద ట్యాంకర్లలో నిత్యం బూడిదను లోడింగ్ చేస్తుంటారు. రోజువారిగా వందలాది ట్యాంకర్లు లోడ్ అవుతుంటాయి. కాగా అక్కడ బూడిద మేటలు వేసి జారిపోయేలా తయారైంది. అందులోనే డ్రైవర్లు కాళ్లు పెట్టి తిరిగి లోడింగ్ అయిన తర్వాత, పైకి ఎక్కి ట్యాంకర్ మూతలు వేసుకుంటుంటారు. తడి యాష్ వల్లే కాలు జారీ పడినట్లు సమాచారం. ఈ విషయమై డీఈ కిరణ్‌ను వివరణ కోరగా లోడింగ్ అనంతరం నీళ్లతో సర్వీసింగ్ చేసిన తర్వాతే బండ్లు బయటకు వెళతాయని తెలిపారు.

పెళ్లికి నిరాకరిస్తున్నాడని యువతి మౌనదీక్ష


సురేష్ ఇంటి ఎదుట పరోషన్, తదితరులు

కామేపల్లి(కారేపల్లి): ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ ఆయన ఇంటి ఎదుట యువతి మౌనదీక్ష చేపట్టింది. కామేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన నూనావత్ పరోషన్ బీటెక్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన భూక్యా సురేష్, ఆమె ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల సురేష్‌కు రైల్వేలో ఉద్యోగం రావడంతో ఇంకో యువతితో వివాహానికి సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలిసినా పరోషన్ తనను పెళ్లి చేసుకోవాలని కోరినా ఒప్పుకోలేదు. దీంతో ఆమె తన కుటుంబీకులతో సహా సురేష్ ఇంటి ఎదుట శుక్రవారం మౌన దీక్ష చేపట్టింది. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పరోషన్ ఫిర్యాదు చేసింది.

తండ్రి మీద దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు

- జోగుళాంబ జిల్లాలో ఘటన



నాగమ్మ (ఫైల్)

శాంతినగర్: వేపచెట్టు నరకవద్దని చెప్పడంతో గొడ్డలితో కన్నతండ్రిపై దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు ఓ కొడుకు. తీవ్రంగా గాయపడిన తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణజడ రాముడు, నాగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు. చిన్న కుమారుడు ప్రేమరాజ్ ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో పది రోజుల క్రితం ప్రేమరాజ్ రామాపురానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తల్లి నాగమ్మను డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించేవాడు. గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకొంటుండగా ప్రేమ్‌రాజు ఇంటిముందున్న వేప చెట్టును నరికేందుకు ప్రయత్నించాడు. తండ్రి వద్దని వారించడంతో వెంటనే గొడ్డలితో తండ్రిపై దాడి చేయబోయాడు. ఆ సమయంలో తల్లి అడ్డుపడగా గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో తల, చెవిపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నాగమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం అలంపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కొడుకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

8 కోచ్‌లు.. టికెట్ ధర రూ. 1,680

- ప్రధాని చేతుల మీదుగా నేడు సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం
- తొలిరోజు సాధారణ ప్రయాణికులకు అనుమతి లేదు
- రేపు తిరుపతి నుంచి మొదలుకానున్న రెగ్యులర్ సర్వీసు



సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేకు తక్కువ సమయంలోనే రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా అందుబాటులోకి వస్తున్న సికింద్రాబాద్–తిరుపతి సర్వీసును ప్రధాని మోదీ శనివారం ఉదయం 11:45 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అయితే తొలిరోజు సాధారణ ప్రయాణికులను అనుమతించరు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసు ఆదివారం మధ్యాహ్నం 3:15 గంటలకు తిరుపతి నుంచి మొదలు కానుంది. సికింద్రాబాద్–తిరుపతి ఏసీ చైర్‌కార్ ధరను రూ. 1,680గా ఖరారు చేయగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధరను రూ. 3,080 (కేటరింగ్ చార్జీలు కలుపుకొని)గా నిర్ణయించారు. అలాగే తిరుపతి–సికింద్రాబాద్ వందే భారత్ రైల్లో ఏసీ చైర్‌కార్ ధర రూ. 1,625గా ఉండగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధర రూ. 3,030గా ఉంది. తిరుపతికి వెళ్లే ఇతర ఎక్స్‌ప్రెస్‌లతో పోలిస్తే ఈ రైల్లో టికెట్ ధరలు అధికంగా నిర్ణయించడంతో ప్రస్తుతానికి 8 కోచ్‌లనే ఏర్పాటు చేశారు. డిమాండ్ ఎలా ఉంటుందో స్పష్టత వచ్చే వరకు తక్కువ కోచ్‌లతోనే నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. శుక్రవారం నుంచి సాధారణ ప్రయాణికులకు టికెట్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ - కొన్ని సంగతులు..

- దేశంలోనే 13వ వందేభారత్ సర్వీసు
- దక్షిణ మధ్య రైల్వేలో రెండోది
- ట్రైన్ నంబర్లు: సికింద్రాబాద్–తిరుపతి 20701, తిరుపతి–సికింద్రాబాద్ 20702
- రెగ్యులర్ ట్రిప్పుల్లో ఈ రైలు ఆగే స్టేషన్లు: నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు
- మొత్తం కోచ్‌లు: 8 (ఎకానమీ చైర్‌కార్ కోచ్‌లు 7, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ కోచ్‌లు 1), రెండూ కలిపి మొత్తం సీట్లు: 530
- ప్రత్యేకతలు: స్లైడింగ్ డోర్స్, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 360 డిగ్రీల కోణంలో తిరిగే కుర్చీలు, ఇతర కోచ్‌లలో సెమీ స్లీపర్ స్థాయిలో తిరిగే కుర్చీలు, ఎమర్జెన్సీ అలారం బటన్, లోకో పైలట్ కేబిన్‌తో మాట్లాడే ప్రత్యేక వ్యవస్థ, సీసీ కెమెరాలు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాలు ఇవీ


సికింద్రాబాద్ టు తిరుపతి			తిరుపతి టు సికింద్రాబాద్	
అరైవల్	డిపార్చర్	స్టేషన్	అరైవల్	డిపార్చర్
-	ఉ.6:00	సికింద్రాబాద్	రా.11:45	-
7:19	7:20	నల్లగొండ	10:10	10:11
9:45	9:50	గుంటూరు	7:45	7:50
11:09	11:10	ఒంగోలు	6:30	6:31
12:29	12:30	నెల్లూరు	5:20	5:21
2:30	--	తిరుపతి	--	3:15

మానవాళికి డెంగీ ముప్పు!

వాతావరణ మార్పులతో దోమల వ్యాప్తి

- 129 దేశాలపై డెంగీ ప్రభావం!
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

సాక్షి, అమరావతి



ప్రపంచవ్యాప్తంగా మానవాళికి డెంగీ ముప్పు పొంచి ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా దోమలు, వైరస్‌ల వ్యాప్తి పెరగడమే ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల వెల్లడించింది. దశాబ్దకాలంగా డెంగీ, జికా, చికున్ గున్యా వంటి ఆర్బో వైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లు భారీగా పెరిగాయని ప్రకటించింది. ఏడాదికి 100 మిలియన్ల నుంచి 400 మిలియన్‌ల వరకు ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదవుతున్నాయని ప్రకటించింది. ప్రస్తుతం జనాభాలో దాదాపు సగం మందికి డెంగీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

డబ్ల్యూహెచ్‌వో వెల్లడించిన కొన్ని ముఖ్యమైన వివరాలు...

- అటవీ నిర్మూలన, పారిశుధ్యం, పట్టణీకరణ, నీటిపారుదలలో సమస్యలు దోమలవ్యాప్తికి ప్రధాన కారణం.
- ముఖ్యంగా అవపాతం(వాతావరణంలో ఉన్న నీటి ఆవిరి ద్రవీకరించడం), ఉష్ణోగ్రత పెరుగుదల, అధిక తేమ వంటివి దోమల అవాసాలకు అనుకూలంగా ఉన్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరంలో డెంగీ కేసులు సుమారు 0.5 మిలియన్ నమోదవగా, 2019 నాటికి 5.2 మిలియన్లకు పెరిగాయి. 2023లోనూ ఇదే ఉధృతి కొనసాగుతోంది.
- ఈ ఏడాది దాదాపు 129 దేశాలు డెంగీ బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే 100కి పైగా దేశాల్లో డెంగీ వ్యాప్తి కనిపిస్తోంది.
- ఈ ఏడాది మార్చి చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా 4,41,898 డెంగీ కేసులు నమోదవగా, 119 మంది మరణించారు.
- చికున్ గున్యా దాదాపు అన్ని ఖండాల్లో విస్తరించింది. ప్రస్తుతం సుమారు 115 దేశాల్లో దాని ప్రభావం ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా జికా వైరస్ క్షీణించింది. అయితే మళ్లీ 89 దేశాల్లో వ్యాప్తిచెందే పరిస్థితులు ఉన్నాయి.

అన్ని భాషల్లోనూ పరీక్ష రాసే అవకాశమివ్వాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి కేటీఆర్
- సీఆర్‌పీఎఫ్‌లో హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లోనే పరీక్ష ఉండటంపై అభ్యంతరం
- రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష నిర్వహించాలని కేంద్ర హోంమంత్రికి లేఖ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష రాసేందుకు వీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాల కోసం కేవలం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే పోటీ పరీక్షల నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కేంద్రమంత్రి అమిత్ షాకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అమిత్ షాకు ఓ లేఖ రాశారు. సీఆర్‌పీఎఫ్ ఉద్యోగ సిబ్బంది నియామకం కోసం చేపడుతున్న ఈ పరీక్షను తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళంతో పాటు గుర్తించబడిన అన్ని అధికారిక భాషల్లో నిర్వహించాలని కోరారు. కేవలం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే ఈ పోటీ పరీక్షలను నిర్వహించడంతో తీవ్ర వివక్ష ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమంలో చదవని లేదా హిందీ ప్రాంతాలకు చెందని నిరుద్యోగ యువకులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 2020 నవంబర్ 18న ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం కేంద్ర ప్రభుత్వానికి ఇదే విషయమై లేఖ కూడా రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాంతీయ భాషల్లో చదువుతున్న కోట్లాది యువకుల పట్ల ఎలాంటి వివక్ష, అసమానతలు లేకుండా వారికి సమాన అవకాశాలు దక్కేలా సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్‌కు సవరణ చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

పేపర్ల లీకేజీలో బీజేపీ హస్తం

- బండి సంజయ్‌పై 'ఉపా'చట్టం కింద కేసు పెట్టాలి
- వచ్చే ఎన్నికల్లో సీపీఎంతో కలసి పోటీ చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ హస్తం ఉన్నట్లుగా తాము భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ పాత్ర బయటపడి ఉండకపోతే రోజుకో పేపర్ లీకయ్యేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఖమ్మంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎవరో ఒకరికి వాట్సాప్‌లో పేపర్ పెడితే.. ఆయన బండి సంజయ్‌కి పంపాడే తప్ప ఇందులో సంజయ్ తప్పేముందని కొందరు మాట్లాడడం గర్హనీయమని అన్నారు. ఫోన్‌లో జరిపిన చాటింగ్‌లో ఏం చేయాలి, ఎలా చేయాలి, ధర్నాలు చేయాలనే సూచనలు ఉన్నట్లుగా తెలుస్తోందని చెప్పారు. పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపే ఇలాంటి చర్యలు ఉగ్రవాద కుట్రల కంటే ప్రమాదకరమైనవి అయినందున సంజయ్‌పై ఉగ్రవాదులపై మోపే 'ఉపా'వంటి కఠిన చట్టాల ఆధారంగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, గతంలో సింగరేణిని ప్రైవేటీకరించబోమని చెప్పిన ప్రధాని.. ఇప్పుడు ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఈనెల 14న హైదరాబాద్ నుంచి మొదలుపెడుతున్న యాత్ర వచ్చేనెల 14న కొత్తగూడెం చేరుకుంటుందని, ఈ సందర్భంగా లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం కలసి పోటీ చేస్తాయని కూనంనేని తెలిపారు. ఈ అంశంపై 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నం కోసం తన్నులాట

టెంట్లు కూల్చి.. కుర్చీలు పగులగొట్టి.. • బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో రసాభాస



సీరోలులో ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలు కూల్చిన టెంట్లు

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం రసాభాసగా మారింది. చాలామంది భోజ నం చేయగా..సుమారు వందమంది కార్యకర్తలకు సరిపోలేదు. దీంతో కాంపల్లి, సీరోలు బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య గొడవ తలెత్తింది. కొందరు అన్నం గిన్నె, కూర గిన్నెలను లాక్కునేందుకు ప్రయత్నించగా.. మరికొందరు టెంట్లను కూలిచ్చేసి కుర్చీలను పగులగొట్టారు. పోలీసులు కల్పించుకుని కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆత్మీయ సమ్మేళనం జరిగిన స్టేజీపై నుంచి కార్యకర్తల ఘర్షణను చూసి నిర్ఘాంతపోయారు. ఈ నెల 5న అయ్యగారిపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలోనూ గ్రామస్తులు కూర గిన్నెలు, అన్నం గిన్నెలు ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లిపోయారు. రెండు ఆత్మీయ సమ్మేళనాల్లో భోజనాల విషయంలో గొడవలు జరగడం గమనార్హం.

బీజేపీలో చేరిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పార్టీలోకి ఆహ్వానించిన ప్రహ్లాద్‌జోషి, అరుణ్ సింగ్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌లు సభ్యత్వ రసీదు అందజేసి, పార్టీ కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవం తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఉపకరిస్తుందన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అవినీతిపై ప్రధాని మోదీ అద్భుతంగా పోరాడుతున్నారని చెప్పారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు.

జిల్లా వార్తలు

నిత్యాన్నదానానికి రూ.3లక్షల విరాళం



ఈఓకు విరాళం అందచేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు శుక్రవారం విరాళం అందచేశారు. విజయవాడకు చెందిన రవెళ్ల సతీష్, హేమచంద్ర రూ.3,03,348ను ఈఓ ఎల్.రమాదేవికి అందజేయగా ఆమె అభినందించారు. కాగా, రశ్మా, నిత్య నందిని, వెంకటనందన్ పేరిట అన్నదానం చేయాలని దాతలు కోరారు. అలాగే, హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన బీకేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కె.రామాంజనేయరెడ్డి కూడా రూ.2,50,888 విరాళం అందజేశారు.

సనోజ్... సలాం



సనోజ్‌కు స్వాగతం పలుకున్న గ్రామస్తులు

ఏన్కూరు: దేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టిన యువకుడు సనోజ్‌కు ఏన్కూరు గ్రామస్తులు స్వాగతం పలికారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కృషినగర్ జిల్లా గరమ్‌పూర్‌బాత్ గ్రామానికి చెందిన 23ఏళ్ల యువకుడు రోవింగ్ సనోజ్ ఇంజనీరింగ్ పూర్తిచేయగా, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పాదయాత్ర చేసి అక్కడి సంస్కృతి, సంప్రదాయాలపై పుస్తకం వెలువరించాలని నిర్ణయించుకున్నాడు. గత ఏడాది అక్టోబర్ 21న మొదలుపెట్టిన యాత్ర పది రాష్ట్రాల పరిధిలో 4,230 కి.మీ పూర్తిచేసుకుని తెలంగాణలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏన్కూరు వచ్చిన ఆయనకు స్థానికులు స్వాగతం పలికి సన్మానించారు.

సమస్యల సాధనకు నిరవధిక సమ్మె



సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీఎస్‌పీఈ జేఏసీ ప్రతినిధులు

- ఈనెల 17నుంచి సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు
- విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ భేటీలో పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం రూరల్: సమస్యల సాధనకు నిరవధిక సమ్మెకు దిగక తప్పడం లేదని టీఎస్‌పీఈ జేఏసీ(తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ) ప్రతినిధులు స్పష్టం చేశారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మె చేపడుతుండగా ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి సమావేశంలో ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు వేతన సవరణ, 2004 వరకు పెన్షన్ సౌకర్యం, ఆర్టిజన్ కార్మికుల సమస్యలు, అన్‌మ్యాన్ కార్మికులు, బిల్ కలెక్టర్లు, పీస్ రేటు కార్మికులు, ఇతర కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ యాజమాన్యం పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరం లేక సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని25 విద్యుత్ సంఘాలు జేఏసీగా ఏర్పడగా, 17వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయడంతో పాటు సమస్యల సాధనకు కలిసిరావాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్‌పీఈ జేఏసీ కేంద్ర కార్యవర్గ ప్రతినిధులు రత్నాకర్‌రావు, ఇనుగాల శ్రీధర్, వజీర్, వెంకన్న గౌడ్, శ్రీనివాస్, వేణుగోపాల్, విజయ్, సంపత్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, జి.నాగరాజు, కలువల సత్యనారాయణరావు, జి.రవీందర్‌తో పాటు తక్కెళ్లపల్లి శేషగిరిరావు, పి.మహేందర్‌రెడ్డి, సామ్యానాయక్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, ఎం.ప్రసాద్, హీరాలాల్, రవికుమార్, మోహన్‌రావు, జీవన్‌కుమార్, సాంబమూర్తి, కిషోర్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమ్మె పోస్టర్లను ప్రతినిధులు ఆవిష్కరించారు.

16న సీపీఎస్ ఉద్యోగుల ర్యాలీ



టీఎన్జీవోస్ నాయకుల మద్దతు కోరుతున్న సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు

ఖమ్మంసహకారనగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈ నెల 16న ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్‌ఈయూ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు. ఖమ్మంలో వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులను శశిధర్ సహా నాయకులు శుక్రవారం కలిసి తమ ర్యాలీకి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న ర్యాలీ నిర్వహించడమే కాక, జూన్ రెండో వారంలో పాత పెన్షన్ సంకల్పయాత్ర, జూలై మొదటి వారంలో బస్సుయాత్ర, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాజకీయ రణరంగ మహాసభ, అక్టోబర్ 1న ఢిల్లీలో పెన్షన్ శంఖనాథ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, టీఎన్జీవోస్, టీజీవోస్, పీఆర్‌టీయూ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్, టీఎస్‌యూటీఎఫ్, టీఆర్‌టీఎఫ్, టీటీఎఫ్, టీఎస్‌పీటీఏ తదితర సంఘాల నాయకులను కలిసి తమ ఆందోళనకు మద్దతు తెలపాలని కోరగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు రాయల కరుణాకర్, తోట విక్రమ్, పోతరెడ్డి రామగోపి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రక్షాళన షురూ!



భద్రాద్రి రామాలయం వ్యూ

- కీలక ఉద్యోగుల విభాగాల్లో మార్పు
- తనిఖీలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్.రమాదేవి తనదైన శైలిలో ప్రక్షాళన ప్రారంభించారు. దేవాదాయ శాఖలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఆమె భద్రాద్రి ఆలయంలోనూ కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. తాజాగా శ్రీరామనవమి ఉత్సవాలు పూర్తి కావడంతో ఆలయ నిర్వహణపై దృష్టి సారించారు. గత మూడు రోజులుగా ఆలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వైదిక పెద్దలతో వరుసగా సమావేశమవుతూ తన తనిఖీల్లో వెల్లడైన లోపాలను వారి దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే, అంతర్గత బదిలీలు సైతం చేపట్టారు. ఇందులో తొలి విడతగా ఏఈఓలుగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణల విభాగాల్లో మార్పు చేసినట్లు సమాచారం. అలాగే, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర విభాగాల ఉద్యోగులను కూడా ఒకటి, రెండు రోజుల్లో బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది.

తనిఖీలకు శ్రీకారం

ఆలయంలో పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వస్తుండడం, సిబ్బందిలో క్రమశిక్షణా రాహిత్యంపై విమర్శలు ఉన్న నేపథ్యాన వీటికి చెక్ పెట్టేందుకు ఈఓ రమాదేవి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఆలయంలోని అన్ని విభాగాల్లో తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ఆలయంలోని ప్రసాదాలు, టికెట్ కౌంటర్లు, ప్రసాదాల స్టోర్ రూం, ప్రచార శాఖలతో పాటుగా అన్ని విభాగాల్లో తనిఖీలు చేసేలా అధికారం కల్పించినట్లు సమాచారం. ఈ కమిటీలో ఈఈ రవీందర్, సూపరింటెండెంట్లు నిరంజన్, శ్రీనివాసరెడ్డి, ఏఈఓ భవాని రామకృష్ణ సభ్యులుగా ఉంటారని తెలుస్తుండగా, అధికారికంగా వెల్లడి కాలేదు. అదేవిధంగా ఆలయ అంతర్గత సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేస్తున్న వారిపై నిఘా వేసినట్లు చెబుతూ తీరు మార్చుకోవాలని హెచ్చరించినట్లుగా ప్రచారం సాగుతోంది.



ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన భక్తులు

భక్తులు, సిబ్బందికి నడుమ వాగ్వాదం

భద్రాచలం రామయ్య ఆలయంలో భక్తులు, ఆలయ సిబ్బందికి నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. బేడా మండపంలో నిత్యకల్యాణానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అయితే, ముందుగా వచ్చిన వారికి కాదని ఇతరులను ముందు వరసలో కూర్చోబెడుతుండడంతో కొందరు అభ్యంతరం తెలిపారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం కూర్చోబెట్టాల్సి వచ్చిందని ఆలయ అధికారులు, సిబ్బంది సర్దిచెప్పినా భక్తులు వినకపోవడంతో ముందు వచ్చిన వారినే తొలి వరుసల్లో కూర్చోబెట్టగా గొడవ సద్దుమణిగింది.

పొత్తు పొడిచినట్లేనా?!



కలిసి సభల్లో పాల్గొంటున్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కమ్యూనిస్టులు చెబుతున్నారు. కానీ ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్‌కు ఓ ప్రజాప్రతినిధి వాహనానికి మాత్రం కమ్యూనిస్టులు ఎర్రరంగు వేసి వాడుకుంటుండడం గమనార్హం. గులాబీ, ఎరుపు రంగులు కలగలిసిన ఈ వాహనం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

బస్సు ఆలస్యంపై ప్రయాణికుల ఆందోళన



ప్రయాణికులకు సర్దిచెబుతున్న ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: సూపర్ లగ్జరీ బస్సు నెమ్మదిగా రావడంతో ప్రయాణం ఆలస్యమైందని పలువురు సత్తుపల్లి ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. గుడ్ ఫ్రైడేకు స్వస్థలాలకు ఎక్కువ మంది వస్తుండటంతో సత్తుపల్లి డిపో అధికారులు హైదరాబాద్ నుంచి రెగ్యులర్ సర్వీస్‌లతో పాటు అదనంగా బస్సులు నడిపించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌లో బస్సు ఎక్కిన ప్రయాణికులు ఉదయం 6.30 గంటలకు సత్తుపల్లి చేరుకోవాల్సి ఉండగా 8.30 గంటలకు వచ్చారు. ఈ బస్సు నాయకన్‌గూడెం వద్దకు చేరుకున్నాక నెమ్మదిగా వెళ్తుండడంతో ప్రయాణికులు నిలిపేశారు. దీంతో డ్రైవర్ సత్తుపల్లి డిపో అధికారులకు సమాచారం ఇవ్వగా ఖమ్మం బస్టాండ్‌లో ఉన్న సత్తుపల్లి డిపో నైట్‌హాల్ట్ ఎక్స్‌ప్రెస్‌ను నాయకన్‌గూడెం పంపించి ప్రయాణికులను సత్తుపల్లికి తీసుకొచ్చారు. అయితే, సూపర్ లగ్జరీ బస్సు టికెట్లు తీసుకుంటే ఎక్స్‌ప్రెస్‌లో తీసుకొచ్చారని ప్రయాణికులు ఆందోళన చేయగా ఆర్టీసీ అధికారులు సర్దిచెప్పి పంపించారు. ఈ విషయమై డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి వివరణ కోరగా సూపర్ లగ్జరీ బస్సులో సాంకేతిక సమస్యతో ఆలస్యమైందని పేర్కొన్నారు.